క్లుప్తంగా

టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

హుజూర్‌నగర్ : దీపావళిని పురస్కరించుకొని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హుజూర్‌నగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బారాం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు ఏర్పాటు చేసే వారు ఫైర్ ఇన్‌స్పెక్టర్, అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని చెప్పారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించొద్దు



ఫుట్‌పాత్‌పై పెట్టిన దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ, సిబ్బంది

కోదాడరూరల్ : ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. కోదాడ పట్టణంలోని ఫుట్‌పాత్‌పై వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయగా వాటిని శనివారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఆయన వెంట ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం



రామారావును సన్మానిస్తున్న శ్రీనివాస్

కోదాడరూరల్ : గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వంగవీటి రామారావును మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం అధ్యక్షుడు భూతం శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, శ్రీనివాసచారి, రంగా ఉన్నారు.


మల్బరీ తోట సందర్శన

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో గల కేవీకేలో పట్టు పరిశ్రమపై నైపుణ్య శిక్షణ పొందుతున్న రైతుల బృందం శనివారం క్షేత్ర సందర్శనలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామంలో రైతు ఉపేందర్‌కు చెందిన మల్బరీ క్షేత్రాన్ని సందర్శించినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఇన్‌చార్జ్ డి.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, పట్టుదారం తీయడం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు శాస్త్రవేత్త వినోద్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే పట్టు పరిశ్రమ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మాధురి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ నర్సిరెడ్డి, అభ్యుదయ రైతు జిల్లా పుండరీకం, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై తీర్మానం

మఠంపల్లి : మండలంలోని కామంచికుంటతండాలో 2025– 26 సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి హామీ పనుల గుర్తింపునకు శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో రైతుల భూమి అభివృద్ధి పనులు, పంట కాలువలు బాగు చేయుట, ఇళ్లలో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పశువుల కొట్టాలు నిర్మించుకునేందుకు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ మేడి బుంగయ్య, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, ఎఫ్ఏ దరావత్ శ్రీనునాయక్, దరావత్ గోవింద్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలస పక్షులు మృతి.. కేసు నమోదు



మృతి చెందిన పక్షులు

హుజూర్‌నగర్‌రూరల్ : వలస పక్షులు మృతి చెందిన ఘటన హుజూర్‌నగర్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగగిరి పెద్దచెరువు వద్ద వలస పక్షులను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నాటు తుపాకులతో వేటాడి కాల్చి చంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలను చూపుతున్న ప్రజలు

మునగాల : మండలంలోని గణపవరం శివారులో గల వాగుపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జిపై విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయని తక్షణమే తీగలను తొలగించాలని మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు కోరారు. శనివారం విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. రోడ్డు హైట్‌లో ఉండడంతో విద్యుత్ తీగలు వాహనాలకు తగిలే ప్రమాదముందని తెలిపారు. వరి కోతల సీజన్ కావడంతో ఈ రహదారిపై నిత్యం వరికోత యంత్రాలు, ట్రాక్టర్ల రద్దీ పెరుగుతుందన్నారు. విద్యుత్ తీగల విషయమై పక్షం రోజుల క్రితం సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

బలహీనంగా వేములూరు కాల్వ కట్ట

- వరదలొస్తే కట్ట తెగి మునుగుతున్న రైతుల పొలాలు
- సీసీ లైనింగ్ నిర్మించాలని వేడుకోలు



అధ్వానంగా కాల్వ కట్ట



మంచ్యాతండా సమీపంలో ఇటీవల తెగిన కట్ట

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల వద్ద గల చిన్న నీటి పారుదల ప్రాజెక్టు అయిన వేములూరు ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఎడమ కాలువ కట్ట బలహీనంగా ఉంది. దీంతో వరదలకు పలుచోట్ల తరచూ కట్ట తెగుతోంది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరదలకు కాలువ కట్ట అనేక చోట్ల తెగి వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కట్ట బలహీనంగా ఉండడంతో అక్కడక్కడ బుంగలు కూడా పడుతున్నాయి.

వరదలొస్తే రైతులకు కష్టం..

అయితే వేములూరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా కామంచికుంటతండా, భీల్యానాయక్‌తండా, బాదావత్‌తండా, చెన్నాయిపాలెం, వరదాపురం, మంచ్యాతండా తదితర తండాలు, గ్రామాలకు చెందిన సుమారు 4 వేల ఎకరాలకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతోంది. అయితే గతంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సుమారు రూ.9 కోట్లు మంజూరు చేయించడంతో కాలువ కట్టకు కొంత మేర సీసీ లైనింగ్ నిర్మించారు. కానీ బాదావత్‌తండా నుంచి వరదాపురం వచ్చే మార్గంలో వెంకటనర్సయ్య రైస్ మిల్ నుంచి మంచ్యాతండా వరకు సుమారు 2.5 కిలో మీటర్ల మేర కాల్వకు లైనింగ్ లేక అధ్వానంగా మారింది. సీసీ లైనింగ్ లేకపోవడంతో ఉధృతంగా నీటి ప్రవాహం వచ్చినప్పుడు కట్టపై నుంచి నీరు పొర్లి పొలాలు దెబ్బతింటున్నాయని, వరదలకు కట్టలు తెగుతున్నాయని రైతులు చెబుతున్నారు. సీసీ లైనింగ్ నిర్మిస్తే కాలువ చివరి భూములకు నీరు ఆటంకం లేకుండా అందుతాయని అంటున్నారు. కావున మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు చొరవ చూపి వేములూరు ఎడమ కాలువకు సీసీ లైనింగ్ చేపట్టేందుకు నీటి పారుదల శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వకు సీసీ లైనింగ్ నిర్మించాలి



వేములూరు ఎడమ కాలువకు గతంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేయించి కొంత దూరం సీసీ లైనింగ్ వేయించారు. కానీ కాలువకు 2. 5 కిమీ మేర సీసీ లైనింగ్ లేక అధ్వానంగా ఉంది. వరదలొచ్చినప్పుడు పొలాలు మునుగుతున్నాయి. కావున కాలువకు సీసీ లైనింగ్ చేపడితే పంటలకు పూర్తిస్థాయిలో నిరందుతుంది.

– భూక్యా భిక్షానాయక్, మంచ్యాతండా

కట్ట తెగి తీవ్ర నష్టం జరిగింది



ఇటీవల భారీగా వచ్చిన వరదలకు వేములూరు ఎడమ కాలువ కట్ట తెగింది. దీంతో వందల ఎకరాల పంటపొలాలు నీట మునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు స్పందించి కాలువకు సీసీ లైనింగ్ నిర్మిస్తే బాగుంటుంది.

– బానోతు ఈశ్వర్‌నాయక్, చెన్నాయిపాలెం

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



సాగర్ సిమెంట్స్ పరిశ్రమ అందజేసిన ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రం సమీపంలోని సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో పరిశ్రమ వ్యవస్థాపకుడు సమ్మిడి వీరారెడ్డి జ్ఞాపకార్థం పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు 2023– 24 విద్యా సంవత్సరానికి గాను శనివారం రూ.4.50లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకటాచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రోత్సాహక నగదు, మెమెంటోలు అందజేసి మాట్లాడారు. మండలంలోని 10 ప్రభుతఉన్నత పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులకు ప్రతి పాఠశాల నుంచి ముగ్గురి చొప్పున ఒక్కొక్కరికి ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10వేల చొప్పున మొత్తం రూ.4.50 లక్షల ప్రోత్సాహక నగదు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ వీపీ ఎంవీ రమణమూర్తి, డీజీఎం హరిదాస్, డీఎం వెంకటరెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు, తల్లిదండ్రులు, పరిశ్రమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి

మునగాల : విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ మునగాలకు చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఈ మెయిల్ పంపారు. గత మూడేళ్లుగా ఫీజులు విడుదల చేయకపోవడంతో ఇంటర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు తమ చదువును మధ్యలోనే ఆపివేయాల్సిన పరిస్థితి నెలకొందని, ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే బకాయిలను విడుదల చేయాలని ఆయన కోరారు.

మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వికాస తరంగిణి సభ్యులు

హుజూర్‌నగర్ : త్రిదండి శ్రీమన్నాయణ చిన్న జీయర్ స్వామి వారి తిరునక్షత్రం సందర్భంగా హుజూర్‌నగర్ వికాస తరంగిణి (ఈటీ 024) వారి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రామాలయంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గెల్లి రంగారావు, సాయి వెంకటలక్ష్మి, నరసింహా, కుకక్కడపు రాంమోహన్‌రావు దాదాపు 400 మంది మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి నిర్వాహకులు కొత్తా కళావతి, భారతమ్మ, వంకాయల పద్మావతి, మాధవి, కామిశెట్టి స్వామి కళావతి, ఆరేటి లక్ష్మి, ఇందిర, లక్ష్మి, శోభారాణి, విజయ, ఈశ్వరమ్మ, సావిత్రమ్మ, భవాని, సుజాత, నాగమణి, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీశైలంయాదవ్

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 3న నిర్వహించబోయే యాదవుల సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని చిన్న శ్రీశైలం యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని కొమరబండ వైజంక్షన్‌లోని ఓ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, రెండు ప్రాంతాల్లోని యాదవులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్, అధ్యక్షుడు బొల్లం సిద్దు యాదవ్, కోఆర్డినేటర్ బత్తుల కిట్టు యాదవ్, జక్కుల నరేందర్‌యాదవ్, మారాల వీరబాబుయాదవ్, లింగయ్యయాదవ్, బొమ్మ సాయి యాదవ్ తదితరులు ఉన్నారు.

గడ్డిపల్లి వాసికి డాక్టరేట్



నరసింహారావు

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం విజయ్‌కుమార్, మమత దంపతుల కుమారుడు నరసింహారావు 'ఎవాల్యుయేషన్ ఆఫ్ ఆంజియోటెన్సిన్ రిసెప్టార్ బ్లాకర్స్ విత్ గ్లియల్ గ్లుటమేట్ ట్రాన్స్‌పర్టార్స్ ఫర్ సెరెబ్రల్ ఇష్కీమియా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మైసూరు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జేఎస్ఎస్ కళాశాలలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జస్టిన్ ఆంటోని ఆధ్వర్యంలో ఆయన పరిశోధన చేశారు. పక్షవాతం వచ్చిన తర్వాత సకాలంలో అధిక రక్తపోటును నియంత్రించే మాత్రలు మరియు ఆంటిబయోటిక్ మందులు కలిపి వాడడం వల్ల కేంద్ర నాడీమండలం మరియు చాలక నాడీ వ్యవస్థ పనితీరు ప్రభావాలకు సంబంధించి తాను రాసిన ఆర్టికల్స్ అంతర్జాతీయ సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురితమైనట్లు నరసింహారావు తెలిపారు. నరసింహారావును కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత



పట్టుబడిన వాహనంలో పశువులు

మునగాల: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మునగాల మండల కేంద్రం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం పోలీసులు పట్టుకున్నారు. కోదాడ పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన మహ్మద్ గులామ్ 13 పశువులను వాహనంలో కోదాడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మునగాల మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గులామ్‌తో పాటు వాహనం డ్రైవర్ మల్లికార్జున్‌పై కేసు నమోదు చేసి పశువులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు విఫలం



మోతె : తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అంజేస్తున్న సీపీఎం నాయకులు

మోతె : రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కోరారు. ఈమేరకు శనివారం మోతె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మండల కమిటీ సభ్యులు కాంపాటి శ్రీను, దోసపాటి శ్రీను, స్వరాజ్యం, వెంకటమ్మ, ఉపేందర్, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

గరిడేపల్లి : నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ శనివారం గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ బొల్లెపల్లి శ్రీనివాస్, దోసపాటి భిక్షం, మండవ సైదులు, సారెడ్డి పాపిరెడ్డి, వీరరాఘవులు, వీరస్వామి, లక్ష్మయ్య, జిలకర పెంటయ్య, శ్రీనివాస్, జానీబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మోతె : అన్నారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి



కోదాడరూరల్ : ఎర్రవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

మోతె : మండలంలోని హుస్సేన్‌బాద్, కొత్తగూడెం, అన్నారిగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. మండల ఏపీఎం వెంకయ్య, ఐకేపీ సీసీ శ్రీనివాస్, వీఓఏ డి.ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బోనస్‌తో ఎకరాకు రూ.10 వేల లబ్ధి

కోదాడరూరల్ : సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌తో ఎకరాకు రూ.10 వేలకు పైగా రైతుకు లబ్ధి చేకూరనుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడ మండలంలోని ఎర్రవరం పీఏసీఎస్ పరిధిలో ఎర్రవరం, రామలక్ష్మీపురం, బీక్యాతండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లెల రాణి, మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సీతారాంరెడ్డి, వెంకటాచారి, లతీఫ్, మధు, ఏఓ రజిని, సిబ్బంది ఉన్నారు.

మహారుద్రాభిషేకానికి సర్వం సిద్ధం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించబోయే మహారుద్రాభిషేకం మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రీఅభయఆంజనేయస్వామి ఆలయం నుంచి రుద్రాక్షలతో అలంకరించిన శివ లింగం ప్రతిమను గాంధీ పార్క్ సెంటర్ వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు తెచ్చిన శుద్ధజలంతో శివలింగానికి అభిషేకం నిర్వహించనున్నారు. 45 మంది నాగ సాధువులు మట్టితో 8 అడుగుల శివలింగాన్ని సిద్ధం చేసి ఆ శివ లింగానికి జల, ఫల, పుష్ప, విభూది, కుంకుమ, సింధూరం, ఆవు నెయ్యి, కిస్మిస్, జీడిపప్పు, పండ్లరసాలు, మారేడుదళాలు, నవగ్రహ దినుసులతో అత్యంత వైభవంగా మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణ ప్రజలు కుటుంబ, బంధుమిత్ర సమేతంగా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజలకు పాలకవర్గం అందుబాటులో ఉండాలి



మంత్రి ఉత్తమ్‌తో మున్సిపల్ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, నాయకులు

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి హైదరాబాద్‌లో శనివారం కలిసి మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఫణిగిరి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు గురించి మంత్రి.. సంపత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. మున్సిపాలిటీ పాలకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. హుజూర్‌నగర్‌ను ఉత్తమ మున్సిపాలిటీగా నిలిపేందుకు పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెల్దండ వీరారెడ్డి, పులిచింతల వెంకటరెడ్డి, సులువ చంద్రశేఖర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

- డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష



ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష, అధికారులు

చిలుకూరు : ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ఏపీడీ, డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. చిలుకూరు మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులపై గ్రామ స్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో చేసిన ఉపాధి హామీ పనులకు మస్టర్లు లేనట్లు ఆడిట్‌లో తేలడంతో అందుకు సంబంధించిన డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో రూ. 26 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. మండలంలో రూ.66 వేల పనులకు సంబంధించి ఆధారాలు చూపించాలని లేనియెడల ఆ నగదు కూడా రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ లచ్చిరామ్‌నాయక్, విజిలెన్స్ అధికారులు వై.లింగారెడ్డి, ఆశా, క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ గిరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ కరుణ శ్రీ, ఎంపీఓ జగదీష్, ఏపీఓ నిర్మల, ఈసీ రవి, టీఏలు మాధవి, స్రవంతి, గిరిప్రసాద్, ఎస్ఆర్‌పీ యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, వీఆర్‌పీలు, ఎఫ్ఏలు, సీనియర్ మేట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల జీవితాల్లో వెలుగులు



కేక్ కట్ చేస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

హుజూర్‌నగర్ : విద్యుత్ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ఐఎన్‌టీయూసీదేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. విద్యుత్ 327 యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నాగన్న గౌడ్‌ను కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కందిబండ వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ అధ్యక్షుడు టి.సురేష్, యూనియన్ నాయకులు ధర్మారావు, చంద్రమౌళి, నాగరాజు, సురేందర్‌రెడ్డి, సుధాకర్, సురేష్‌రెడ్డి, జహీర్, రమణారెడ్డి, నరసింహారావు, ఐఎన్‌టీయూసీ నాయకులు బి.గురవయ్య, సీహెచ్.రాము, ఎస్.జానయ్య, ఎం.ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు 'ఇందిరా మహిళాశక్తి'



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మెప్మా సిబ్బంది

కోదాడరూరల్ : పేదరిక నిర్మూలనకు ఇందిరా మహిళాశక్తి పథకం వరమని, ఆ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని నయానగర్‌లో గల శ్రీరామ్‌నగర్ ఎస్ఎల్ఎఫ్–1 సమాఖ్యలోని సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వగృహ హోమ్ ఫుడ్స్ తయారీని వారు పరిశీలించి మాట్లాడారు. స్వయం ఉపాధి పొందే మహిళా సంఘాలకు శ్రీనిధి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ప్రభుత్వం రుణాలు అందజేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కాసం రేణుక, సీఈఓ సాయికృష్ణ, సీఎల్ఆర్పీలు రాణి, విజయరాణి, జ్యోతి, మమత, శ్రీరామ్, మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



హుజూర్‌నగర్ : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వార్డు అధికారులు



నేరేడుచర్ల : నిరసన తెలుపుతున్న వార్డు అధికారులు

నేరేడుచర్ల : వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న వార్డు అధికారి మామిండ్ల జయరాములుపై మున్సిపల్ చైర్ పర్సన్ భర్త పోగాకు విశ్వేశ్వర్ దాడికి పాల్పడడాన్ని ఖండిస్తూ శనివారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట వార్డు అధికారులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డికు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వివాదంలో ఉన్న ఫైల్‌పై సంతకం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ భర్త ఒత్తిడి చేయడంతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫైల్‌పై సంతకం చేయనని అధికారి అనడంతో ఆగ్రహంతో దాడి చేసిన విశ్వేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో వార్డు అధికారులు మధుసూదన్, పాపయ్య, అనిత, రహీంపాష, రమ, సైదులు, గోపినాథ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : కొత్తకోట మున్సిపల్ వార్డు అధికారిపై దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వార్డు అధికారిపై దాడి చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పి.విశ్వేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సైదులు, అజయ్, సుధారాణి, లక్ష్మి, మధుబాబు, శేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అలివేలు, నారాయణ, వీరమణి, కౌసల్య, శివకుమారి, సలీం, వెంకటనర్సమ్మ, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

నేరేడుచర్ల : పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 28వ తేదీన ఆలయ ప్రధాన పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పాల్వాయి శ్రీనివాస్, పాల్వాయి రమేష్‌లు శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండలానికి చెందిన ఆర్ఎంపీ చెరుకూరి బాబు –ఉష దంపతుల కుమార్తె శృతి పుట్టిన రోజును పురస్కరించుకొని పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముంత లింగయ్య, సంగిశెట్టి రాము, కుందూరు అప్పారావు, వల్లోజు సతీష్, వల్లోజు నవీన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 200 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్ గురుస్వామి తెలిపారు. అన్నదానానికి గణపవరం గ్రామానికి చెందిన గవిని శ్రీనివాసరావు –ఈశ్వరి దంపతులు సహకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్లు సురేష్, కొమ్ము ఈదారావు, వల్లోజు వెంకన్న పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

నేరేడుచర్ల : పట్టణంలో శనివారం మహిళా సమాఖ్య (సీపీఐ అనుబంధ సంఘం) సభ్యత్వ నమోదును ఆ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సమాఖ్య నాయకురాళ్లు నాగమణి, లక్ష్మమ్మ, సోమమ్మ తదితరులు ఉన్నారు.